# శ్రవణలోపం - సమస్యలు

Sravan Project

అందరం వినగలము ...

*We all can hear ...*

GLOW


**గౌతు లచ్చన్న బలహీన వర్గాల సంస్థ (గ్లో)**

డోర్ నెం. 7-5-64, ప్లాట్ నెం. 48, పాండురంగపురం,
మెయిన్ రోడ్, విశాఖపట్నం - 530 003, ఆంధ్రప్రదేశ్.

**Gouthu Latchanna Organisation for Weaker Sections**

Door No. 7-5-64, Plot No. 48, Pandurangapuram,
Visakhapatnam – 530 003, A.P.
Web Site : www.glowfoundations.com,
Email : contact@glowfoundations.com
Cell : 9490690483

G L O W

## శ్రవణలోపం (వినికిడి సమస్య)

మానవుడి అభివృద్ధికి, వికాసానికి దోహదపడే జ్ఞానేంద్రియాలలో చెవి కీలకమైనది. మానవ సంబంధాలు, సామాజిక అనుబంధాలు అన్నీ వ్యక్తుల మధ్య సరైన సంభాషణ ద్వారానే సాధ్యమవుతుంది. అయితే ఈ సంభాషణా సామర్థ్యం మనిషిలో ఏర్పడాలంటే ముందుగా కావలసింది "మాటలను వినగలగడం"! మాటలను వినడం - వాటికి తగినట్లుగా ప్రతిస్పందించడం మానవ సంబంధాలకు పునాది. కానీ ప్రస్తుతం వేర్వేరు కారణాలవల్ల లక్షలాది మంది ప్రజలు శ్రవణలోపం (వినికిడి సమస్య)తో బాధపడుతున్నారు. దానికితోడు పిల్లలలో "శ్రవణలోపం" ఏర్పడితే అది తీవ్రపరిణామాలకు దారితీస్తుంది. బంగారు భవిష్యత్తులో ఎంతో ముందంజ వేయాల్సిన పిల్లలు శ్రవణలోపం వల్ల ఎన్నో మానసిక, సామాజిక, మానవీయ, సామర్థ్యపరమైన సమస్యలను ఎదుర్కొంటున్నారు.

## శ్రవణలోపం - మేధోవికాసం పై ప్రభావం

1. మనిషి మేధస్సుకు కారణమయ్యే సామర్థ్యాలలో ఆలోచించడం, ఊహించడం, స్పందించడం వంటివి ముఖ్యమైనవి. శ్రవణలోపం పిల్లలలో ఆలోచనా సామర్థ్యాన్ని దెబ్బతీసే అవకాశం ఉంది.

2. ధ్వనులను, శబ్దాలను, మాటలను వినలేకపోవడం వల్ల శ్రవణలోపంతో బాధపడే పిల్లలలో సరైన "ప్రతిస్పందనాప్రవర్తన" అలవడటం కష్టం.

3. శ్రవణలోపంతో బాధపడే పిల్లలలో విషయాన్ని అర్ధంచేసుకోవడం, అవగాహన చేసుకోవడం కష్టభారం అవుతుంది.

## శ్రవణలోపం - చదువుకోవడంలో సమస్యలు

1. సాధారణ పిల్లల మేధోసామర్ధ్యంతో పోల్చుకుంటే అభ్యాసంలో, విద్యార్జనలో శ్రవణలోపంతో ఉండే పిల్లలు వెనుకబడే అవకాశం ఉంది.
2. శ్రవణలోపం వల్ల భాషను నేర్చుకోవడంలో సమస్యలు, తద్వారా పాఠ్యపుస్తకాలలోని విషయాన్ని జ్ఞానాన్ని అభ్యసించడంలో సమస్యలు వస్తాయి.
3. పాఠశాలలోని ఇతర విద్యార్థులతో కలవకుండా ఈ శ్రవణలోపం పిల్లలను వేరుగా ఉండేలా చేస్తుంది.
4. పాఠశాలలోని సబ్జెక్ట్‌లలోని పారిభాషిక పదాలు - వాటి అర్థాలు, వంటివి అవగాహన చేసుకోవడం కష్టమవుతుంది. తద్వారా చదువులో వెనుకబడటం, ఫెయిల్ అవడం సంభవించవచ్చు.
5. ఈ పిల్లలు సాధారణంగా పుస్తకాలను చదవడంలో, గణితం మరియు సామాన్యశాస్త్రం వంటి సబ్జెక్ట్‌లలో వెనుకబడతారు.
6. సాధారణ పిల్లలు మరియు శ్రవణలోపంతో బాధపడే పిల్లల మధ్య కనిపించని అంతరాలు పెరుగుతాయి. పాఠాలు నేర్చుకోవడంలో చురుకుదనం తగ్గుతుంది.

## శ్రవణలోపం - భాషా సమస్యలు

1. వ్యక్తులలో భాష రావడానికి మొదటి మెట్టు తోటి మానవుల మాటల్ని వినగలగడమే! మాటల్ని వింటూ పదాలను, వాక్యాలను, వాటి అర్థాలను, ఆ వాక్యాలను ఉపయోగించే సందర్భాలను మనం నేర్చుకుంటాము. మళ్ళీ వాటిని అవసరం వచ్చినపుడు తిరిగి ఉపయోగిస్తాము. శ్రవణలోపంతో బాధపడే పిల్లలలో మాటలను వినలేకపోవడం వలన భాషనేర్చుకొనే సామర్థ్యం తగ్గిపోతుంది.
2. చాలామంది మూగపిల్లలలో వారిలోని మూగతనానికి కారణం - వినికిడి సమస్యే! అంటే గొంతు, స్వరపేటిక, చక్కగా ఉన్నప్పటికి వినగలిగే సామర్థ్యం లేకపోవడం వల్ల భాషను, పదాలను, వారు నేర్చుకోలేకపోతారు.
3. శబ్దాలను మాటలను సరైన స్థాయిలో వినలేకపోవడం వలన ఈ పిల్లలు ప్రయత్నించినా ఉచ్చారణ లోపం ఏర్పడి వారు మాట్లాడిన మాటలు ఇతరులకు అర్థం కానటువంటి సందర్భములు కలుగుతాయి.

4. వ్యక్తుల మధ్య అనుబంధాలకి భాష–మాట సంధాన వారధి! తోటి వ్యక్తులు చెప్పిన మాటల్ని వినలేని తనం ఈ పిల్లలలో సరైన విధంగా స్పందించకుండా చేస్తుంది. దాంతో ఇతరులతో సంబంధ–బాంధవ్యాలు దెబ్బతినే అవకాశం ఉంది.

5. ఈ తెలియనితనం చివరికి మూగతనానికి దారి తీస్తుంది.

## శ్రవణలోపం – సామాజిక సమస్యలు

1. శ్రవణలోపంతో బాధపడే పిల్లలు తమకు తేలియకుండానే ఇతరులతో కలవలేకుండా పోతారు. ఒంటరివారిమైపోయామనే భావన ఏర్పడుతుంది.

2. తమ ఈడు పిల్లలతో కలవలేకపోతారు. ఇతరులకు తమకు మధ్య ఉన్న "కమ్యూనికేషన్ గ్యాప్" వల్ల శ్రవణ లోపంతో బాధపడే పిల్లలలో "ఆత్మన్యూనతాభావం" పెరిగే అవకాశం ఉంది. ఇది చివరికి పిల్లలలో సర్దుబాటు సమస్యలను సృష్టిస్తుంది.

3. కుటుంబంలో, పాఠశాలలో, సమాజంలో అంతటా తమకు మిగతా ప్రపంచానికి మధ్య ''సంబంధాలు'' తెగిపోయినట్లుగా భావించే అవకాశం ఉంది. ఈ ధోరణి శ్రవణలోపంగల పిల్లలలో అశాంతికి, మానసిక వేదనకు, దు:ఖానికి కారణమవుతుంది. తద్వారా ఈ పిల్లలకు – సమాజానికి మధ్య దూరం పెరుగుతుంది.

4. మనసులో ఎన్నెన్నో భావాలు కదలాడినా, వాటిని తోటివారికి అర్థమయ్యేలా చెప్పలేని సమస్య వీరిలో ఆటంకంగా కనిపించి ''ఎమోషనల్ ఎక్స్‌ప్రెషన్'' (భావోద్వేగ వ్యక్తీకరణం) అనేది కుంటుపడుతుంది.

## చివరి మాట

శ్రవణలోపాలు/వినికిడి సమస్యలను పిల్లల పెరుగుదలలోని ఏ దశలోనైన మనం సులభంగానే గుర్తించ వచ్చు. నెలల శిశువులో సైతం ఈ సమస్యను కొన్ని కొన్ని సంకేతాలు, లక్షణాల ద్వారా గుర్తించడం సాధ్యమవుతుంది. ఇక్కడ సమస్యను గుర్తించడమంటే సగం సమస్య పరిష్కారమయినట్లే! పిల్లలలో శ్రవణలోపాన్ని గుర్తించగానే దగ్గరలోని ఆసుపత్రికి వెళ్ళి తగిన పరీక్షలు చేయించాలి. డాక్టరు సూచనల మేరకు సమస్య తీవ్రతను బట్టి శ్రవణయంత్రాలను అమర్చడం ద్వారా గానీ, సర్జరీ ద్వారా గాని, స్పీచ్ థెరపి లేదా శ్రవణ – భాషా చికిత్స విధానం (ఆడిటరీ వర్బల్ థెరపి) ద్వారా గానీ శ్రవణలోపాలను / వినికిడి సమస్యను అధిగమించవచ్చు.